ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్

కోనసీమ

జిల్లా వార్తలు

బుధవారం 31 జనవరి 2024 | 5

రేపటి నుంచి పది రోజులు

కాటన్ బ్యారేజీపై రాకపోకలు బంద్

- వివరాలు 7లో

కార్డ్ ప్రైమ్ 2.0తో

అష్టకష్టాలు



- రిజిస్ట్రేషన్ నూతన విధానం లోపభూయిష్టం
- తరచూ సాంకేతిక సమస్యలు
- కక్షిదారులకు తప్పని తిప్పలు



మండపేట, జనవరి 30:

ప్రజలకు మెరుగైన సత్వర సేవలు అందించాలన్న ఉన్నతాశయంతో ప్రభుత్వం రిజిస్ట్రేషన్ శాఖలో కార్డ్‌ప్రైమ్ 2.0 విధానాన్ని తీసుకొచ్చింది. ఇది లోపభూయిష్టంగా తయారైంది. కక్షిదారులు అనేక ఇబ్బందులుపాలవుతున్నారు. వాటిని ఏమాత్రం సరిచేయకపోవడంతో చాలా మంది నష్టపోతున్నారు. చివరికి దళారులను ఆశ్రయించాల్సి వస్తోంది. లేకుంటే రెండు, మూడు రోజులకు కానీ దస్తావేజులు రావట్లేదు. ఇన్ని సమస్యలతో కొటుమిట్టాడుతుండగా తాజాగా ప్రభుత్వం మరో మార్పు చేయడంపై కక్షిదారులు మండిపడుతున్నారు.

ఆస్తి రిజిస్ట్రేషన్‌కు సంబంధించిన విధానంలో మార్పు జరిగింది. ఇది వరకు రిజిస్ట్రేషన్ నెంబరును సబ్ రిజిస్ట్రార్ కేటాయించి రిజిస్ట్రేషన్ చేసేవారు. ఇక నుంచి సాఫ్ట్‌వేరే దస్తావేజు రిజిస్ట్రేషన్ నెంబరు కేటాయించనుంది. ఈ మార్పు సోమవారం అమల్లోకి వచ్చింది. జగనన్న ఇళ్ల పట్టాలకు సచివాలయాల్లోనే రిజిస్ట్రేషన్ చేయనున్న నేపథ్యంలో ఈ విధానం అమలు చేయనుండడంతో సాంకేతిక సమస్య తలెత్తి సర్వర్ మొరాయిస్తోంది. ఫలితంగా జిల్లావ్యాప్తంగా రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ముందుకు సాగట్లేదు. దాంతో కక్షిదారులకు ఇబ్బందులు తప్పడం లేదు.

ఆస్తి కొనుగోలుకు ముందుగా ఇ-స్టాంపింగ్ పత్రాలు కొనుగోలు చేయాల్సి ఉంటుంది. ఈ పత్రాల్లో సదరు వ్యక్తి పేరుతో పాటు తీసుకున్న తేదీ నమోదు చేస్తారు. సాంకేతిక సమస్యల వల్ల ప్రింటింగ్‌లో తప్పులు దొర్లితే సమస్య తలెత్తుతోంది. మళ్లీ కొత్తగా ఈ-స్టాంపింగ్ పత్రాలు కొనుగోలు చేయాల్సి రావడం, వాటిని సాఫ్ట్‌వేర్ తీసుకోకపోవడంతో కొనుగోలుదారులు ఇబ్బందిపడుతున్నారు. దస్తావేజులు అదే రోజు అందితే కొత్తగా పత్రాలు కొనుగోలు చేసే అవకాశం ఉంటుంది. రెండు, మూడు రోజుల తర్వాత పత్రాలు తీసుకున్న సమయంలో లోపాలను గుర్తించినపుడు సమస్యలు తలెత్తుతున్నాయి. వీటిని మార్చుకునే అవకాశం లేకపోవడంతో ప్రజలకు పాట్లు తప్పట్లేదు.

ఒక సర్వే నెంబరుతో ఉన్న పొలాన్ని, స్థలాన్ని విభజించి వేర్వేరు వ్యక్తులకు రిజిస్ట్రేషన్ చేసేందుకు వీలులేదు. ఒక సర్వే నెంబరును రెండోసారి రిజిస్ట్రేషన్ చేసేందుకు పాస్‌వర్డ్ అమోదించకపోవడం ప్రధాన లోపంగా మారింది. ఉదాహరణకు ఒక వ్యక్తి 10 సెంట్ల స్థలంలో 5 సెంట్లను ఒకరికి విక్రయించి రిజిస్ట్రేషన్ తర్వాత మిగిలిన 5 సెంట్లను మరొకరికి విక్రయించే అవకాశం లేదు.

భారమంతా ప్రజలపైనే...

గతంలో దస్తావేజులు విక్రయించే స్టాంప్ వెండర్లకు ప్రభుత్వం 5శాతం కమీషన్ ఇచ్చేది. ప్రస్తుతం ఇ-స్టాంపింగ్ పత్రాలను విక్రయించే వారికి కమీషన్ ఇవ్వట్లేదు. దీంతో వారు ఒక్కో పత్రానికి రూ.50 ఆదనంగా వసూలు చేస్తున్నారు. స్టాంప్ వెండర్ల అనుమతుల మంజూరు పునరుద్ధరణకు స్టాంప్స్ కార్యాలయం, సిబ్బంది రూ.1,500 నుంచి రూ.2,000 వరకు వసూలు చేస్తున్నారు. భారమంతా ప్రజలపైనే మోపుతున్నారు. స్టాంప్ వెండర్లకు ఇచ్చే ప్రింట్ మార్కెట్లో రూ.15 ఉండగా ప్రభుత్వం అధిక ధరకు విక్రయిస్తోందన్న ఆరోపణలున్నాయి.

సర్వర్లు పనిచేయక ఇక్కట్లు

అమలాపురం టౌన్, జనవరి 30: గత నాలుగు రోజులుగా సర్వర్లు సక్రమంగా పనిచేయకపోవడంతో అమలాపురం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద కక్షిదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సుదూర ప్రాంతల నుంచి వచ్చిన వృద్ధులతో పాటు ఇతరులు ఉదయం నుంచి సాయంత్రం వరకు పడిగాపులు పడుతున్నా ప్రయోజనం లేదు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన కార్డు ప్రైమ్-2 విధానం వల్ల ఇప్పటికే పలు సాంకేతిక సమస్యలు ఎదుర్కొంటున్నారు. దాంతో రిజిస్ట్రేషన్ల సంఖ్య కూడా తగ్గింది. జగనన్న కాలనీల్లో పట్టాల రిజిస్ట్రేషన్ కోసం సర్వర్లు మార్పు చేయడంతో ఈ ఇబ్బంది తలెత్తింది. అయితే అధికారులనుంచి సరైన సమాధానం లేక రిజిస్ట్రేషన్లు ఎప్పుడు పూర్తవుతాయో తెలియని పరిస్థితి నెలకొంది.



కలెక్టరేట్‌లో గాంధీజీ విగ్రహానికి పుష్పమాల వేసి నివాళులర్పిస్తున్న జాయింట్ కలెక్టర్ నుపూర్‌అజయ్

‘అహింస, సత్యాగ్రహాలే గాంధీజీ ఆయుధాలు’

అమలాపురం టౌన్, జనవరి 30: అహింస, సత్యాగ్రహాలే ఆయుధాలుగా దేశానికి స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు సాధించిన మహనీయుడిగా జాతిపిత మహాత్మాగాంధీ నిలుస్తారని జాయింట్ కలెక్టర్ ఎస్.నుపూర్‌అజయ్ పేర్కొన్నారు. గాంధీజీ వర్ధంతిని పురస్కరించుకుని మంగళవారం కలెక్టరేట్ ప్రాంగణంలోని మహాత్ముని విగ్రహానికి ఆమె పుష్పమాల వేసి నివాళులర్పించారు. గాంధీ వర్ధంతని అమరవీరుల దినోత్సవంగాజరుపుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి సీహెచ్ సత్తిబాబు, కలెక్టరేట్ పరిపాలనాధికారి కె.కాశీవిశ్వేశ్వరరావు, సెక్షన్ సూపరింటెండెంట్లు పి.సుబ్రహ్మణ్యం, జలవనరుల శాఖ డీఈ శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు. ఇందుపల్లిలోని ఎ1 కన్వెన్షన్ హాలులో జరిగిన కార్యక్రమంలో మంత్రి పినిపే విశ్వరూప్ గాంధీజీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. స్వాతంత్ర్య పోరాటానికి నాయకత్వం వహించిన మహా నేతల్లో మహాత్మాగాంధీ ఒకరన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీలు కుడుపూడి సూర్యనారాయణరావు, బొమ్మి ఇజ్రాయిల్ తదితరులు పాల్గొన్నారు.



గడియార స్తంభం సెంటర్లో మహాత్మా గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేసి నినాదాలు చేస్తున్న సర్పంచ్‌ల సంఘ ప్రతినిధులు

సర్పంచ్‌ల నిరసన దీక్ష

- రాష్ట్ర ప్రభుత్వం దారి మళ్లించిన నిధులను పంచాయతీలకు తక్షణం జమ చేయాలని పెద్ద ఎత్తున నినాదాలు
- గడియార స్తంభం సెంబర్లో మహాత్ముని విగ్రహానికి వినతి
- సర్పంచ్‌లను ఉత్సవ విగ్రహాలుగా మార్చేశారు: శాసనమండలి మాజీ డిప్యూటీ చైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యం
- దీక్షాపరులకు తెలుగుదేశం పార్టీ నేతల సంఘీభావం

అమలాపురం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం దారి మళ్లించిన నిధులను గ్రామ పంచాయతీలకు తక్షణం జమ చేయాలని డిమాండు చేస్తూ ఏపీ సర్పంచ్‌ల సంఘం, ఏపీ పంచాయతీరాజ్ చాంబర్ పిలుపు మేరకు జిల్లా సర్పంచ్‌ల సమాఖ్య ఆధ్వర్యంలో మంగళవారం అమలాపురం గడియార స్తంభం సెంటర్లో నిరసన దీక్ష చేపట్టారు. ఉమ్మడి జిల్లా సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షురాలు నాగాబత్తుల శాంతకుమారి, ఉమ్మడి జిల్లా కార్యదర్శి రంబాల రమేష్ ఆధ్వర్యంలో తొలుత మహాత్మాగాంధీ వర్ధంతిని పురస్కరించుకుని బాపూజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గాంధీజీ కలలు కన్న స్వరాజ్యం సాధించే దిశగా స్వయం పాలనకై రూపొందించిన గ్రామ పంచాయతీ వ్యవస్థను బలోపేతం చేసేలా జగన్ ప్రభుత్వానికి కనువిప్పు కలిగించాలని కోరుతూ గాంధీజీ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. సర్పంచ్‌ల విధులు, నిధులకై గల్లీ నుంచి ఢిల్లీ వరకు ఆందోళనలు చేసినా రాష్ట్ర ప్రభుత్వంలో చలనం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం జిల్లా నలుమూలల నుంచి వచ్చిన సర్పంచ్‌లు గడియార స్తంభం సెంటర్లో నిరసన దీక్షలో పాల్గొన్నారు.

దీక్షా శిబిరాన్ని శాసనమండలి మాజీ డిప్యూటీ చైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యం, అమలాపురం మాజీ ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, రాష్ట్ర కార్యదర్శి పెచ్చెట్టి చంద్రమౌళి, దెందుకూరి సత్తిబాబురాజు సందర్శించి సంఘీభావం తెలిపారు. జగన్ ప్రభుత్వంలో సర్పంచ్‌లు ఉత్సవ విగ్రహాలుగా మిగిలిపోయారని సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. పంచాయతీలను మరింత బలోపేతం చేసేందుకు రాజ్యాంగ సవరణల ద్వారా విధులు, నిధులతో పాటు ఎన్నో అంశాలను చేర్చారని, వాటన్నింటినీ రాష్ట్ర ప్రభుత్వం తుంగలోకి తొక్కిందన్నారు. వలంటీర్లను, సచివాలయాలను పంచాయతీల్లో విలీనం చేసి సర్పంచ్‌ల ఆధ్వర్యంలోనే అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు నిర్వహించాలని డిమాండు చేశారు. 14, 15 ఆర్థిక సంఘాల నిధులతో పాటు ఉపాధి హామీ నిధులను సొంత పథకాలకు రాష్ట్ర ప్రభుత్వం దారి మళ్లించి పంచాయతీ వ్యవస్థను నిర్వీర్యం చేసిందని ధ్వజమెత్తారు. పంచాయతీలకు రావాల్సిన మైనింగ్ సెస్, రిజిస్ట్రేషన్ ఫీజు, తలసరి గ్రాంటు వంటి ఎగ్గొట్టిన రూ.4వేల కోట్ల నిధులను రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీలకు తక్షణం జమ చేయాలన్నారు. మైనర్ పంచాయతీల విద్యుత్ బిల్లులను గత ప్రభుత్వాల మాదిరిగా రాష్ట్ర ప్రభుత్వమే చెల్లించాలని డిమాండు చేశారు. 73, 74 రాజ్యాంగ సవరణ చట్టాలను అమలు చేసి పంచాయతీ వ్యవస్థలను బలోపేతం చేయాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. పలువురు సర్పంచ్‌లు మాట్లాడుతూ మమ్మల్ని నమ్మి ఓటేసిన ప్రజలకు ముఖం చూపించుకోలేని పరిస్థితుల్లో ఉన్నామని ఆవేదన వ్యక్తం చేశారు. నిరసన దీక్షలో సర్పంచ్‌ల సంఘ ప్రతినిధులు చెల్లుబోయిన హెలీన, అడబాల తాతకాపు, పెద్దిరెడ్డి రామచంద్రరావు, ఇసుకపట్ల రఘుబాబు, పరమట శ్యామ్‌కుమార్, జాలెం సుబ్బారావు, సలాది బుచ్చిరాజు, చిక్కం జంగమయ్య (పెదబాబు), గానాల భారతి, గొలకోటి దొరబాబు, తోట శ్రీదేవి, నక్కా రాజారత్నానాగవేణి తదితరులు పాల్గొన్నారు. శిబిరాన్ని చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్ష, కార్యదర్శులు కల్వకొలను తాతాజీ, యెండూరినాగేశ్వరరావు, సంగినీడి బాబులు, జనసేన, టీడీపీ నాయకులు యేడిద శ్రీను, శిరిగినీడి వెంకటేశ్వరరావు, డొక్కా నాథ్‌బాబు, బొర్రా ఈశ్వరరావు, భాస్కర్ల రామకృష్ణ తదితరులు సందర్శించి సంఘీభావం తెలిపారు.



మాట్లాడుతున్న శాసనమండలి మాజీ డిప్యూటీ చైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యం



కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలుపుతున్న సెర్ప్ ఉద్యోగులు

జగన్ ఇచ్చిన హామీలను అమలు చేయాలి

- కళ్లకు గంతలు కట్టుకుని సెర్ప్ ఉద్యోగుల నిరసన

అమలాపురం టౌన్, జనవరి 30: అధికారంలోకి వచ్చిన వెంటనే సెర్ప్ ఉద్యోగులను రెగ్యులర్ చేస్తామని సీఎం జగన్ ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండు చేస్తూ చేపట్టిన నిరవధిక సమ్మె మంగళవారం 8వ రోజుకు చేరుకుంది. కలెక్టరేట్ ఎదుట సమ్మె శిబిరంలో సెర్ప్ ఉద్యోగులు కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలిపారు. ప్రభుత్వం కళ్లు తెరిచి తమకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. న్యాయమైన డిమాండ్లను పరిష్కరించే వరకు సమ్మె కొనసాగిస్తామని యూనియన్ అధ్యక్షుడు డి.వరాలబాబు, కార్యదర్శి ముత్తాబత్తుల వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. బుధవారం జరిగే రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో సెర్ప్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. తెలంగాణలో సెర్ప్ ఉద్యోగులకు అమలు చేసిన విధంగా రాష్ట్రంలో కూడా అమలు చేయాలన్నారు. కోటి మంది డ్వాక్రా మహిళలు సెర్ప్ ఉద్యోగుల వెనక ఉన్నారని సీఎం జగన్ గుర్తించాలన్నారు. ఐ.పోలవరం మండల వీవోఏలు సమ్మె శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు. తొలుత మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సెర్ప్ ఉద్యోగ సంఘ ప్రతినిధులు కేవీబీ ప్రసాద్, షేక్ సయ్యద్, వీవీవీ రమణ, భూపతి వర్మ, కె.వెంకటలక్ష్మి, ఎం.నాగవేణి, అయితాబత్తుల సురేంద్ర, ర్యాలి అర్జున్, ముత్యాల రమేష్, పి.రమాకాంత్, నక్కా నాగవేణి, కె.విజయ, ఎం.ధనరాజు, ఎ.రఘురామ్, కె.శ్రీను, బి.కృష్ణవేణి, మోర్త సత్యవతి, వీవోఏల సంఘ నాయకుడు ఆర్.మంగతాయారు, ఆర్.గౌరీపార్వతి, ఆర్.దుర్గ తదితరులు పాల్గొన్నారు.



అమలాపురం డిపో ఆవరణలో ధర్నా చేస్తున్న ఎన్ఎంయూ అసోసియేషన్ నాయకులు

‘విశాఖ డీపీటీవో కక్ష సాధింపు చర్యలు మానుకోవాలి’

అమలాపురం టౌన్, జనవరి 30: విశాఖపట్నం డీపీటీవో ఎన్ఎంయూ సభ్యులపై కక్ష సాధింపు చర్యలు మానుకోవాలని డిమాండు చేస్తూ మంగళవారం ఆర్టీసీ అమలాపురం డిపో ఆవరణలో నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. కేంద్ర కార్యాలయం ఇచ్చిన ఆదేశాలు అమలు చేయాలని, విశాఖ డీపీటీవోపై చర్యలు తీసుకోవాలని, 1/19 సర్క్యులర్ అమలు చేయాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. యూనియన్ రీజనల్ కార్యదర్శి పందిరి రాంబాబు, డిపో కార్యదర్శి పితాని మణిరాజు, కార్మికులు హాజరుకాగా యుడబ్ల్యుయు కార్యదర్శి గణపతి ధర్నాకు సంఘీభావం తెలిపారు.

నేటి నుంచి ‘ఆడుదాం ఆంధ్ర’ జిల్లా స్థాయి పోటీలు

అమలాపురం టౌన్, జనవరి 30: జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో బుధవారం నుంచి వచ్చే నెల నాలుగో తేదీ వరకు ఆడుదాం ఆంధ్ర జిల్లా స్థాయి పోటీలను సజావుగా నిర్వహించాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా ఒక ప్రకటనలో కోరారు. క్రీడల నిర్వహణకు కొందరు అధికారులకు విధులు, బాధ్యతలు కేటాయించామన్నారు. 15ఏళ్లు పైబడిన స్త్రీలు, పురుషుల విభాగాల్లో క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్ పోటీలను షెడ్యూలు ప్రకారం అమలాపురం జీఎంసీ బాలయోగి స్టేడియంలో నిర్వహిస్తామన్నారు. ఓవరాల్ ఇన్‌చార్జిలుగా ఆర్డీవో జి.కేశవర్ధనరెడ్డి, చేనేత, జౌళి శాఖ సహాయ సంచాలకుడు మెట్టి గౌరీశంకరరాజు వ్యవహరిస్తారు.

స్విమ్మింగ్ పూల్‌లో పడి బాలుడి దుర్మరణం

యానాంలో ఘటన - వివరాలు 7లో

నేడు జేఎన్టీయూకే 10వ స్నాతకోత్సవం



అలూమ్నీ ఆడిటోరియం లాన్‌లో స్నాతకోత్సవ ఏర్పాట్లుచేస్తున్న దృశ్యం

జేఎన్టీయూకే, జనవరి 30: కాకినాడ జేఎన్టీయూకే 10వ స్నాతకోత్సవంను బుధవారం ఉదయం 10.30నుంచి అలూమ్ని ఆడిటోరియంలో నిర్వహించనున్నట్లు ఉపకులపతి ప్రొఫెసర్ జీవీఆర్ ప్రసాదరాజు తెలిపారు. దీనికి సంబంధించి వర్శిటీలోని వీసీ సమావేశ హాల్లో మంగళవారం డీఏఏ, పీఆర్వో ప్రొఫెసర్ సీహెచ్ సాయిబాబు అధ్యక్షతన నిర్వహించిన మీడియా సమావేశంలో వీసీ పాల్గొని స్నాతకోత్సవ నిర్వహణ వివరాలను వెల్లడించారు. ఈసందర్భంగా వీసీ మాట్లాడుతూ 2022-23 విద్యా సంవత్సరంలో ఉత్తీర్ణులైన విద్యార్థులకు డిగ్రీలు, 64 మంది పరిశోధక విద్యార్థులకు పీహెచ్‌డీ పట్టాలు, ప్రతిభావంతులైన విద్యార్థులకు 28 బంగారు, ఎండోమెంట్ పతకాలు ప్రదానంచేస్తారన్నారు. అదేవిధంగా బీటెక్ 34,199, బీఫార్మసీ 1477, ఎంటెక్ 1689, ఎంబీఏ 1093, ఎంసీఏ 343, ఎంఫార్మసీ 332, బీబీఏ 21, ఫార్మాడీ 182, బీఆర్క్ 13మంది విద్యార్థులకు సంబంధిత డిగ్రీలను ప్రధానం చేస్తారన్నారు. స్నాతకోత్సవానికి కులపతి, రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్‌నజీర్ అధ్యక్షత వహిస్తారని, మాజీ నేవీ రియర్ అడ్మిరల్ ఎస్.వెంకటశేషాచారి ముఖ్యఅతిథిగానూ, విద్యాశాఖామంత్రి బొత్స సత్యనారాయణ ప్రత్యేక అతిథిగానూ పాల్గొంటారని తెలిపారు. టీసీఎస్ టెక్నాలజీ, సాఫ్ట్‌వేర్ సర్వీసెస్ ప్రెసిడెంట్ వి.రాజన్నకు వర్శిటీ తరపున గౌరవ డాక్టరేట్‌ను ప్రధానం చేస్తారన్నారు. స్నాతకోత్సవ వేడుకలకు పాలకమండలి సభ్యులు, మాజీ ఉపకులపతులు, రాష్ట్ర ఉన్నతవిద్యామండలి ఛైర్మన్ హేమచంద్రారెడ్డి, ఉన్నతవిద్యాశాఖాధికారులు వర్శిటీ అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది పూర్వవిద్యార్థులు పాల్గొంటారని తెలిపారు. సమావేశంలో రెక్టార్ కేవీ రమణ, రిజిస్ట్రార్ ఎల్.సుమలత, ఓఎస్‌డీ కోటేశ్వరరావు, పరిశోధనాభివృద్ధి డైరెక్టర్ వి.రవీంద్ర పాల్గొన్నారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయని వీసీ తెలిపారు. సాయంత్రం స్నాతకోత్సవం రిహార్సల్స్‌ను వీసీ అధ్యక్షతన నిర్వహించారు.

- రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ రాక
- టీసీఎస్ ప్రెసిడెంట్ వి.రాజన్నకు గౌరవ డాక్టరేట్
- పలువురికి పీహెచ్‌డీ, డిగ్రీ పట్టాలు, బంగారు పతకాలు ప్రదానం
- ఏర్పాట్లు పూర్తి ● స్నాతకోత్సవానికి రిహార్సల్స్
- ఉదయం 10.30 నుంచి ఆరంభం



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న వీసీ జీవీఆర్ ప్రసాదరాజు

స్నాతకోత్సవానికి ముఖ్యఅతిథిగా ఎస్వీ శేషాచారి



జేఎన్టీయూకే, జనవరి 30: కాకినాడ జేఎన్టీయూకే 10వ స్నాతకోత్సవానికి ముఖ్యఅతిథిగా విచ్చేయుచున్న మాజీ నేవీ రియర్ అడ్మిరల్ ఎస్.వెంకటశేషాచారి కాకినాడలోని ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాలలో విద్యనభ్యసిస్తున్నప్పుడు యూనివర్శిటీ ఎంట్రీ స్కీమ్ కింద ఇండియన్ నేవీలోని ఎలక్ట్రికల్ విభాగంలో నియమితులయ్యారు. ఐఎన్ఎస్ రాణా, రణవీర్ సబ్‌మెరైన్‌లలో సేవలందించి ఐఎన్ఎస్ కళింగట్ విశాఖపట్నం క్షిపణి స్థాపనలో ముఖ్యపాత్ర పోషించారు. అంతేకాకుండా ఆయన నౌకలు, జలాంతర్గాములు రెండింటికీ అనేక పరికరాలు, వ్యవస్థల స్వదేశీకరణలో కీలకపాత్ర పోషించారు. రష్యాలోని పోటిబ్లాక్ సీ పోర్టులో ఎక్విప్‌మెంట్ ఓరియంటెడ్ కోర్సు, సికింద్రాబాద్‌లోని కాలేజ్ ఆఫ్ డిఫెన్స్ మేనేజ్‌మెంట్ కోర్సు, న్యూఢిల్లీలోని నేషనల్ డిఫెన్స్ కళాశాలలో ఎన్‌డీసీ కోర్సు పూర్తిచేశారు. నేవీలో ఆయన అందించిన సేవలకుగానూ భారత ప్రభుత్వం విశిష్ట సేవా పతకంతో సత్కరించింది. మజగాన్ డాక్‌లిమిటెడ్(ఎండీఎల్)లో షిప్ డైరెక్టరుగా ఎంపికైన తరువాత 22 మార్చి 2007లో రియర్ అడ్మిరల్ హోదాలో ఇండియన్ నేవీ నుంచి తాత్కాలిక పదవీ విరమణ చేశారు. అణు జలాంతర్గాములు, నౌకాదళ నౌకలకోసం వివిధ పరికరాలు, వ్యవస్థలను రూపొందించడంలో వెంకటశేషాచారి కీలకపాత్ర పోషించారు.

ఆయనొక బహుముఖ ప్రజ్ఞాశాలి

- టీసీఎస్ ప్రెసిడెంట్ రాజన్నకు జేఎన్టీయూకే గౌరవ డాక్టరేట్



జేఎన్టీయూకే, జనవరి 30: రేపు నిర్వహించనున్న కాకినాడ జేఎన్టీయూకే 10వ స్నాతకోత్సవానికి గౌరవ డాక్టరేట్ అందుకునేందుకు విచ్చేయుచున్న టీసీఎస్ టెక్నాలజీ, సాఫ్ట్‌వేర్‌సర్వీసెస్ ప్రెసిడెంట్ వి.రాజన్న బహుముఖ ప్రజ్ఞాశాలి. ఆయన 30ఏళ్ల నుంచి విద్యావ్యవస్థలు, పరిశ్రమలు, ప్రభుత్వ విభాగాలలో తనదైన శైలిలో ముద్రవేశారు. మానవ వనరులు, సేల్స్ పరిశోధనాభివృద్ధి, విద్య మార్కెటింగ్ తదితర అంశాలలో అమెరికా, చైనా, తైవాన్, సింగపూర్ దేశాలు ఆయన సాంకేతిక అనుభవాన్ని వినియోగించుకుంటున్నాయి. రాజన్న ప్రస్తుతం టీసీఎస్‌లో సీనియర్ వైస్ ప్రెసిడెంట్‌గానూ గ్లోబల్ హెడ్ ఆఫ్ ద కమ్యూనికేషన్స్, మీడియా, టెక్నాలజీ గ్రూపులకు తన సేవలను అందిస్తున్నారు. ఆయన నాయకత్వంలో హైదరాబాద్‌లోని టీసీఎస్ ప్రపంచస్థాయిలో 3వ స్థానం సంపాదించడంతో పాటూ 4500 ఉద్యోగాల నుంచి 90 వేల ఉద్యోగాలను టీసీఎస్ కల్పించింది. జేఎన్టీయూకేతో పాటూ పలు అనుబంధ కళాశాలలకు బీఓఎస్ సభ్యునిగా వ్యవహరించి పైథాన్, వెబ్‌టెక్నాలజీ, మొబైల్ కంప్యూటింగ్, బ్లాక్ చైన్‌టెక్నాలజీలలో సిలబస్ రూపకల్పనకు కృషిచేశారు.

● సాధించిన అవార్డులు

ఐటీ పరిశ్రలకు రాజన్న అందించిన సేవలను గుర్తించి గవర్నమెంట్ ఆఫ్ జిజియాంగ్‌వెస్ట్ లేక్ ఫ్రెంచ్ షిప్ అవార్డును అందించారు. అదేవిధంగా 2007లో ఐటీ ప్రొఫెషనల్ ఆఫ్‌ది ఇయర్‌గా అవార్డును హెచ్ఎంఏ అందించింది. 2012లో నాయుడమ్మ పురస్కారాన్ని ఏపీ ప్రభుత్వం ప్రధానం చేసింది. 2016లో ఎన్ఐటీ వరంగల్ నుంచి విశిష్ట పూర్వ విద్యార్థి అవార్డును, 2019లో విజ్ఞాన్ వర్శిటీ గౌరవ డాక్టరేట్‌ను అందించింది. అంతేకాకుండా హైదరాబాద్ మేనేజ్‌మెంట్ అసోషియేషన్ (హెచ్ఎంఏ) ఆయనకు 2023లో లైఫ్‌టైమ్ ఎచీవ్‌మెంట్ పురస్కారాన్ని అందించింది.

‘నన్నయ’లో నేడు పట్టాల పండుగ

- స్నాతకోత్సవానికి ఏర్పాట్లు పూర్తి
- రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ రాక
- ఇన్ఫోసిస్ ఫౌండేషన్ చైర్‌పర్సన్‌కు గౌరవ డాక్టరేట్

దివాన్‌చెరువు, జనవరి 30: ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం 13, 14, 15వ స్నాతకోత్సవానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. విశ్వవిద్యాలయంలోని ఎన్టీఆర్ కన్వెన్షన్ భవనంలో బుధవారం మధ్యాహ్నం 2గంటల నుంచి నిర్వహించనున్న ఈ కార్యక్రమానికి రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ విచ్చేసి పట్టాల ప్రదానం చేస్తారని వీసీ పద్మరాజు తెలిపారు. ముఖ్యఅతిథిగా ఇన్ఫోసిస్ ఫౌండేషన్ ఛైర్‌పర్సన్ సుధామూర్తి హాజరై ప్రసంగిస్తారని, విశ్వ విద్యాలయం తరపున ఆమెకు గౌరవ డాక్టరేట్ ప్రదానం చేస్తామన్నారు. అతిథులుగా ఉన్నత విద్య ప్రిన్సిపల్ కార్యదర్శి జె.శ్యామలరావు, కళాశాల విద్యా కమిషనర్ పోలా భాస్కర్, రాష్ట్ర ఉన్నతవిద్యా మండలి ఛైర్మన్ ఆచార్య కె.హేమచంద్రారెడ్డి తదితరులు విచ్చేయనున్నారని చెప్పారు. పట్టాలు స్వీకరించే వారు సూచించిన నిబంధనలను పాటిస్తూ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ఏర్పాట్లు పరిశీలించిన జిల్లా అధికారులు

స్నాతకోత్సవ కార్యక్రమ ఏర్పాట్లను వీసీ పద్మరాజు, ఎస్పీ పి.జగదీష్, జాయింట్ కలెక్టర్ ఎన్.తేజ్ భరత్, ఆర్డీవో ఏ.చైత్రవర్షిణి, నన్నయ రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్ తదితర జిల్లా అధికారులు మంగళవారం పరిశీలించారు. సభా ప్రాంగణాన్ని, గవర్నర్ కోసం సిద్ధంచేసిన అతిథి గృహాన్ని పరి శీలించి ట్రైల్ రన్ నిర్వహించారు.



ఏర్పాట్లు పరిశీలిస్తున్న నన్నయ వీసీ, జిల్లా అధికార్లు

నేడు గవర్నర్ పర్యటన ఇలా..

దివాన్‌చెరువు, జనవరి 30: రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్‌నజీర్ బుధవారం జిల్లాలో పర్యటించనున్నారు. మధ్యాహ్నం 12.45గంటలకు కాకినాడ నుంచి బయలుదేరి మధ్యాహ్నం 1.05 గంటలకు గైట్ కళాశాలలోని హెలీప్యాడ్‌కు చేరుకుంటారు. అనంతరం స్థానికంగా ఏర్పాటుచేసిన అతిథిగృహానికి చేరుకుని విరామం తీసుకుంటారు. తదుపరి మధ్యాహ్నం 3గంటల నుంచి సాయంత్రం 4.35వరకూ నన్నయ విశ్వవిద్యాలయంలో జరిగే స్నాతకోత్స వంలో పాల్గొంటారు. ఆ తరువాత గైట్ కళాశాలలోని హెలీప్యాడ్‌కు చేరు కుని సా.4.55గంటలకు హెలికాప్టర్‌లో గన్నవరం విమానాశ్రయానికి బయ లుదేరి వెళతారు. అక్కడ నుంచి విజయవాడ రాజభవన్‌కు చేరుకుంటారు.

అంతర్వేది ఉత్సవాలు

వైభవంగా నిర్వహించాలి

- ఏర్పాట్లు పరిశీలించిన ఆర్డీవో కేశవర్ధనరెడ్డి



తెప్పోత్సవం నిర్వహణ పనులను పరిశీలిస్తున్న ఆర్డీవో కేశవర్ధనరెడ్డి

అంతర్వేది, జనవరి 30: బీఆర్ అంబేద్కర్ కోనసీమజిల్లా సఖినేటిపల్లి మండలం అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామివారి దివ్య తిరు కల్యాణ మహోత్సవాలు ఫిబ్రవరి 16నుంచి 25వ తేదీ వరకు అత్యంత వైభవంగా నిర్వహించాలని అమలాపురం ఆర్డీవో జి.కేశవర్ధనరెడ్డి అన్నారు. మంగళవారం తీర్థ మహోత్సవ ఏర్పాట్లపై ముందుగా ఆలయ చైర్మన్ క్యాబిన్‌లో వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. ఉత్సవ ఏర్పాట్లలో అధికారులందరూ తమ పనితీరును మెరుగుపరుచుకోవాలని, ఉత్సవాలు ప్రారంభమయ్యే నాటికి ఈ ఏర్పాట్లన్నీ పూర్తి చేయాలన్నారు. కల్యాణ మండపం, రథం, చక్రస్నానం, తెప్పోత్సవం ప్రదేశాలను పోలీసు, ఆలయ అధికారులతో ఆర్డీవో మంగళవారం పరిశీలించారు. ఎలక్ట్రికల్ వర్క్స్, పందిర్లు, క్యూలైన్లు, బందోబస్తు, పార్కింగ్ ఏర్పాట్లు, సీసీ కెమెరాల ఏర్పాటుపై సమీక్షించి అనంతరం తెప్పోత్సవం నిర్వహించే మంచినీటి చెరువు పనులు జరుగుతున్న కారణంగా గోదావరిలో లేక అదే మంచినీటి చెరువులో నిర్వహించేందుకు ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులతో మాట్లాడారు. కార్యక్రమంలో రాజోలు సీఐ గోవిందరాజు, సఖినేటిపల్లి ఎస్ఐ ఎస్.రాము, తహసీల్దార్ రమాకుమారి, ఆలయ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ, ఎంపీటీసీ బైరా నాగరాజు, సర్పంచ్ కొండా జాన్‌బాబు, అధికారులు పాల్గొన్నారు.

రేపటి నుంచి 10 వరకూ

కాటన్ బ్యారేజీపై రాకపోకలు బంద్

రాజమహేంద్రవరం, జనవరి 30(ఆంధ్రజ్యోతి/ఆత్రేయపురం: ధవళేశ్వరం సర్ ఆర్థర్ కాటన్ బ్యారేజి రోడ్డు మరమ్మతు పనులు వేగంగా చేయడం కోసం ఫిబ్రవరి 1నుంచి 10వతేదీ వరకూ ఈబ్యారేజీని మూసివేసి, రాకపోకలు బంద్ చేస్తున్నట్టు జిల్లా కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత తెలిపారు. రూ.2కోట్లతో ఈపనులు చేపట్టారని, త్వరగా పూర్తవ్వడానికి వీలుగా వాహనాల రాకపోకలు ఆపుతున్నామన్నారు. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ట్రాఫిక్ మళ్లింపు ఏర్పాట్లు చేయాలని పోలీసు అధికార్లను ఆదేశించారు. ప్రైవేట్ స్కూల్ బస్సులు ప్రత్యామ్నాయ మార్గాలు చూసుకోవాలన్నారు. కొన్నేళ్లుగా బ్యారేజి ఛిద్రమై అస్తవ్యస్తంగా మారింది. బ్యారేజీని పటిష్టపరచాలని ప్రతిపక్షాలు, ప్రజా సంఘాలు ఆందోళన సైతం నిర్వహించాయి. ఈ నేపథ్యంలో ధవళేశ్వరం నుంచి విజ్జేశ్వరం వరకు బ్యారేజీ, రోడ్డు మరమ్మతులకు ప్రభుత్వం రూ.2 కోట్లు నిధులు మంజూరు చేసింది. ఈ నేపథ్యంలో బ్యారేజీపై తారు పొరలను తొలగించి గోతులు పూడ్చే కార్యక్రమాన్ని చేపడుతున్నారు. బుధవారం నుంచి పది రోజులపాటు వాహనాల రాకపోకలు నిలుపుదల చేస్తున్నట్టు బ్యారేజీ డీఈ ప్రదీప్‌కుమార్ తెలిపారు.



ఆత్రేయపురం మండలం బొబ్బర్లంక బ్యారేజీ వద్ద జరుగుతున్న పనులు

అన్నవరంలో నూతన అన్నదాన

భవనం నిర్మాణానికి ప్రణాళిక!

అన్నవరం, జనవరి 30: ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధికి 2016 నుంచి ఎదురుచూస్తున్న ప్రసాద్ స్కీం నిధులు అతిత్వరలో విడుదలకానున్నాయి. రూ.10కోట్లు మంజూరైనట్లు తెలుస్తోంది. దీనిపై దేవస్థానానికి అధికారికంగా సమాచారం రాకపోయినా రాష్ట్ర టూరిజం శాఖకు కేంద్ర టూరిజంశాఖ నుంచి సమాచారం అందినట్లు తెలుస్తోంది. ఈ నిధులతో అన్నదానభవనం నిర్మించాలని దేవస్థానం అధికారులు ఆలోచన చేస్తున్నారు. ఈమేరకు మంగళవారం దేవదాయశాఖ డిప్యూటీ స్థపతి శ్రీనివాస ఆచారి సత్యదేవ సన్నిధి అన్నదానభవనం ఎక్కడ ఏర్పాటుచేయాలనే దానిపై పరిశీలన చేశారు. టీటీడీ సత్రం తొలగించిన ప్రాంగణాన్ని ఆయన దేవస్థానం ఇంజనీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. రెండు మూడ్రోజుల్లో అధికారిక సమాచారం వచ్చిన వెంటనే కాకినాడ ఎంపీతో చర్చించి స్థలపరిశీలన అనంతరం తుది నిర్ణయం తీసుకుంటారన్నారు. దేవస్థానానికి చేయించే రథాలను డిప్యూటీ స్థపతి మంగళవారం పరిశీలించారు.

సత్యదేవుడిని దర్శించుకున్న

సినీ రచయిత జె.కె.భారవి



సత్యదేవుడి దర్శనానంతరం సినీ రచయిత జె.కె భారవి

అన్నవరం, జనవరి 30: ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధిలో మంగళవారం ఆధ్యాత్మిక చిత్రాలైన అన్నమయ్య, శ్రీ రామదాసు, మంజునాథ వంటి చిత్రాలకు రచయితగా పనిచేసిన జె.కె.భారవి స్వామిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనకు ఆలయ సూపరింటెండెంట్ కృష్ణప్రసాద్ ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. దర్శనానంతరం వారికి వేదపండితులు వేదాశీర్వచనాలు అందజేశారు.

స్విమ్మింగ్‌పూల్‌లో పడి బాలుడి దుర్మరణం

- నిర్వాహకుల నిర్లక్ష్యమే కారణమంటూ బంధువుల ఆందోళన

యానాం, జనవరి 30: యానాం ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థి స్విమ్మింగ్‌పూల్‌లో పడి మృతి చెందిన సంఘటన యానాంలో చోటుచేసుకుంది. పాఠశాలలో మధ్యాహ్న భోజనం అనంతరం ఆడుకునేందుకు వెళ్లిన విద్యార్థి విగతజీవిగా పడి ఉండటంతో బంధువులు, విద్యార్థులు ఆందోళనకు గురయ్యారు. స్థానిక అగ్రహారానికి చెందిన సూరిమిల్లి రాజు, శ్యామల దంపతులకు ఇద్దరు కుమారులు. వీరిలో పెద్దకుమారుడు సూరిమిల్లి సాయిరోహిత్ (7) స్థానిక శిశువైద్యనిలయం ప్రాథమిక పాఠశాలలో 1వ తరగతి చదువుతున్నాడు. మంగళవారం మధ్యాహ్నం పాఠశాలలో భోజనం చేసిన తరువాత పలువురు విద్యార్థులతో కలిసి ఆడుకునేందుకు బయటకు వెళ్లారు. అక్కడ స్విమ్మింగ్‌పూల్‌లో ప్రమాదవశాత్తు జారి పడిపోయాడు. ఆ సమయంలో తోటి స్నేహితులు తప్ప ఎవ్వరూ లేకపోవడంతో కొంత సమయం గడిచిపోయింది. అనంతరం అక్కడ ఉన్న విద్యార్థులు వీరిని చూసి తక్షణం స్విమ్మింగ్‌పూల్‌లో ఉన్న బాలుడిని యానాం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే బాలుడు మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రిలో మృతదేహం వద్ద తల్లి, బంధువులు బోరున విలపించారు. స్విమ్మింగ్‌పూల్ వద్ద సెక్యూరిటీగార్డు, రక్షణచర్యలు లేకపోవడంతోనే తన కుమారుడు మృతి చెందాడని మృతుని బంధువులు, స్థానిక గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. యానాం పరిపాలనాధికారి కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. బాలుడి కుటుంబానికి న్యాయం చేయాలని, సంఘటనలో బాధ్యులను గుర్తించి చర్యలు తీసుకోవాలని ఆందోళన చేయడంతో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. పరిపాలనాధికారి మునిస్వామి ఆసుపత్రిలో బాలుడి మృతదేహాన్ని, సంఘటన జరిగిన స్విమ్మింగ్‌పూల్ ప్రాంతాలను పరిశీలించి ఆందోళన చేస్తున్న ఆందోళనకారులతో మాట్లాడారు. బాలుడి కుటుంబానికి న్యాయం జరిగేలా, నిర్వాహకులపై చర్యలుతీసుకునేలా చర్యిస్తామని తెలపడంతో ఆందోళన విరమించారు. ఈ సంఘటనపై యానాం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ షణ్ముగం నేతృత్వంలో యానాం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



బాలుడి మృతదేహం పరిశీలిస్తున్న మునిస్వామి, ఇన్‌సెట్‌లో సాయిరోహిత్



ఆర్ఏ కార్యాలయం ఎదురుగా ఆందోళన చేస్తున్న బంధువులు, గ్రామస్థులు

తండ్రీకొడుకుల బతుకు బండి ఆగింది!

- ఆగి ఉన్న మార్కెట్ లారీని ఢీకొన్న టిప్పర్ లారీ
- మరమ్మతులు చేసుకుంటున్న తండ్రీ కొడుకులు మృతి

రావులపాలెం, జనవరి 30: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రావులపాలెం గౌతమి కొత్త వంతెన దిగువన జాతీయ రహదారిపై సోమవారం అర్ధరాత్రి ఆగి ఉన్న లారీని టిప్పర్ లారీ బలంగా ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు మృతి చెందగా మరో ఇద్దరికి తీవ్ర గాయాలైన సంఘటన పోలీసులకు తెలిసింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పశ్చిమగోదావరి జిల్లా ఆకివీడు మండలం ... (48) అతని కుమారుడు నాగసత్యసాయి (26) ఆకివీడు నుంచి ... విశాఖపట్నంలో ... బయల్దేరారు. సోమవారం అర్ధరాత్రి రావులపాలెం గౌతమి కొత్తవంతెన దిగువన ప్రభుత్వ కళాశాల సమీపంలో జాతీయ రహదారిపైకి వచ్చేసరికి లారీ మరమ్మతులకు గురైంది. లారీ డ్రైవర్, క్లీనర్ కిందకు దిగి మరమ్మతులు చేసుకుంటున్నారు. ... టిప్పర్ లారీ ... దిగి ఉన్న లారీని బలంగా ఢీకొట్టారు. దీంతో లారీ వద్ద మరమ్మతులు చేసుకుంటున్న తండ్రీకొడుకులు అక్కడికక్కడే మృతి చెందారు. ప్రమాద సమయంలో టిప్పర్ లారీ క్యాబిన్ ... డ్రైవర్, క్లీనర్ లారీ క్యాబిన్‌లో ఇరుక్కుపోయారు. ఆ సమయంలో తమను రక్షించాలంటూ ఆర్తనాదాలు చేశారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు, హైవే సిబ్బంది సంఘటనా ప్రాంతానికి చేరుకుని రెండు క్రేన్ల సాయంతో సుమారు మూడు గంటలపాటు శ్రమించి క్యాబిన్‌లో ఇరుక్కున్న ... డ్రైవర్, క్లీనర్లను బయటకు తీశారు. క్షతగాత్రులను రాజమహేంద్రవరం ఆసుపత్రికి తరలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కొత్తపేట ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతుల బంధువు పి.వెంకటకృష్ణారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఆడిషనల్ ఎస్ఐ ప్రేమ్‌కుమార్ మంగళవారం తెలిపారు.



గౌతమి వంతెన సమీపంలో జరిగిన ప్రమాదంలో టిప్పర్ లారీ ఢీకొనడంతో మార్కెట్ లారీ కిందపడి మృతి చెందిన డ్రైవర్, క్లీనర్



రోడ్డు ప్రమాదంలో ముందు ఆగిన ఉన్న లారీని వెనుక నుంచి ఢీకొన్న టిప్పర్ లారీ



అయ్యవరం-దూబచర్ల మధ్య ఆయిల్ ఫాం తోటలో పులి సంచరించే ప్రదేశాలను పరిశీలిస్తున్న అటవీ అధికారులు

బాబోయ్ పెద్ద పులి!

- రామశింగవరంలో దూడను చంపిన వైనం
- ట్రాప్ కెమెరాల ఫలితం శూన్యం
- తూతూ మంత్రంగానే గాలింపు చర్యలు
- పొలం పనులకు వెళ్లేందుకు వణికిపోతున్న కూలీలు, రైతులు

నల్లజర్ల, జనవరి 30: ఐదు రోజులుగా పెద్ద పులి ప్రజలను, అధికారులను కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. ప్రజలు, మూగ జీవుల ప్రాణాలకు రక్షణ కరువైంది. పులి నల్లజర్ల మండల శివారు ద్వారకాతిరుమల మండలం రామశింగవరం గ్రామంలో ఓ దూడను మంగళవారం ఉదయం చంపి సమీపంలో ఉన్న ఆయిల్‌పామ్ తోటల్లోకి ... వెళ్లిపోయింది. సోమవారం పుల్లలపాడు ఫారెస్ట్ నుంచి నేరుగా వీరభద్రపురం ఫారెస్ట్ మీదుగా చాదారికుంట-రామశింగవరం వెళ్లినట్టు పాదముద్రలను ఫారెస్ట్ అధికారులు గుర్తించారు.

అధికారులు స్పందించడం లేదు

పెద్ద పులి కనిపించిందని గ్రాముస్తులు ఫారెస్ట్ అధికారులకు సమాచారం ఇచ్చిన వెంటనే స్పందించడం లేదని పలు గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పులి వచ్చిన 5,6 గంటలకు వచ్చి తూతూ మంత్రంగా పాదముద్రలు సేకరించి వెళ్లిపోతున్నారని చెబుతున్నారు. నల్లజర్ల మండలంలో 9 ట్రాప్ కెమెరాలు ఏర్పాటు చేసినప్పటికీ ఒక్క కెమెరాలోను పులి జాడ కానరాలేదు.

ప్రజలు, మూగ జీవాలకు రక్షణ కరువు

పెద్ద పులి సంచరిస్తుందని పదే పదే ప్రజలు గగ్గోలు పెడుతున్నా ఫారెస్ట్ అధికారులు మినహా ప్రభుత్వ విభాగాల అధికారులు ను సమన్వయం చేసుకోవడం లేదు ... తప్ప ప్రజలకు, పశువుల పెంపకందారులకు భరోసా కల్పించలేకపోతున్నారు. పొలం పనులకు వెళ్లాలంటే వ్యవసాయ కూలీలు, రైతులు భయపడిపోతున్నారు. పులి సంచరిస్తున్న గ్రామాల్లో పోలీసులు, ఇతర శాఖల అధికారులతో సమన్వయమై ప్రజలు, మూగజీవాల ప్రాణాలకు రక్షణ కల్పించాలని కోరుతున్నారు. అవసరమైతే గ్రామంలోని కొంతమంది యువకులను వలంటీర్లుగా ఉపయోగించుకోవాలని చెబుతున్నారు.



పులి పాదముద్ర(ఫైల్)

విద్యుదాఘాతంతో యువకుడు మృతి

ద్రాక్షారామ, జనవరి 30: బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం మండలం అన్నాయిపేటలో మంగళవారం విద్యుదాఘాతానికి గురై వెల్ల గ్రామానికి చెందిన వాసంశెట్టి మునీంద్ర(32) మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వెల్ల గ్రామానికి చెందిన వాసంశెట్టి మునీంద్ర రాడ్ బెండింగ్ పనిచేస్తుంటాడు. మంగళవారం ఉదయం అన్నాయిపేటలో ఆల్లం రామకృష్ణ ఇంటివద్ద శ్లాబ్ పనిచేస్తున్నాడు. ఉండగా ప్రమాదవశాత్తూ ఐనుప ఊచ కరెంటు తీగలకు తగలడంతో విద్యుదాఘాతానికి గురై ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో ... ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు. ద్రాక్షారామ ఎస్ఐ జి.సురేంద్ర కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

గొల్లప్రోలు రూరల్, జనవరి 30: కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం చేబ్రోలులో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మరణించారు. కాకినాడరూరల్ మండలం వాకలపూడిలో నివాసముంటున్న చింతల వీరబాబు (30) రౌతులపూడి మండలం ఎస్.పైడిపాల వెళ్లి మోటార్‌సైకిల్‌పై తిరిగి వస్తున్నాడు. చేబ్రోలు పెద్దచెరువు వద్దకు వచ్చేసరికి ముందు వెళుతున్న ట్రాలీ సడన్‌బ్రేక్ వేయడంతో ఢీకొట్టాడు. ప్రమాదంలో వీరబాబు అక్కడికక్కడే మరణించాడు. గొల్లప్రోలు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పొట్టిలంక చెక్‌పోస్టు వద్ద

నగదు, వెండి వస్తువులు స్వాధీనం

కడియం, జనవరి 30: పొట్టిలంక చెక్‌పోస్టు వద్ద మంగళవారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కారులో ఎటువంటి బిల్లులు లేకుండా తీసుకెళ్తున్న రూ.1,50,000 నగదు, మరో కారులో బిల్లులు లేకుండా తీసుకెళ్తున్న రూ.4,50,000 విలువైన 6.5 కిలోల వెండి వస్తువులు సీజ్ చేసినట్టు పోలీసులు తెలిపారు. కడియం ఇన్‌స్పెక్టర్ బీతులశీధర్ మాట్లాడుతూ ప్రజలు ఎక్కువ మొత్తంలో నగదు, వస్తువులు తీసుకెళ్తే సమయంలో ఆధారాలు ఉంచాలని, లేకుంటే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు.



నగదు, వెండి వస్తువులను స్వాధీనం చేసుకున్న పోలీసులు

మౌలిక సదుపాయాల కల్పనకు కృషి

మామిడికుదురు, జనవరి 30: ప్రజలకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు ప్రభుత్వం కల్పిస్తుందని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు, జడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు పేర్కొన్నారు. పాశర్లపూడిలో నూతనంగా నిర్మించిన రైతు భరోసాకేంద్రం, సచివాలయ భవనాలను వారు మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ కసిరెడ్డి అంజిబాబు, సర్పంచ్ కొనుకు ప్రేమజ్యోతి, స్థలదాత గంధం గోపాల్, ఎంపీటీసీలు నెల్లి దుర్గాప్రసాద్, వీరాంజనేయులు, తులా గోపాలకృష్ణ పాల్గొన్నారు.

జైలు నుంచి వచ్చిన జగన్ జైలుకే

టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండారు సత్యానందరావు



మాట్లాడుతున్న బండారు సత్యానందరావు

కొత్తపేట, జనవరి 30: రాష్ట్రంలో గాలికొచ్చిన వైసీపీ మళ్లీ గాలికే పోతుందని... జైలు నుంచి వచ్చిన జగన్ మళ్లీ జైలుకే వెళ్తారని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండారు సత్యానందరావు అన్నారు. వాడపాలెంలో మంగళవారం జరిగిన టీడీపీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డాయని, ఆ పార్టీ నాయకుల రాజీనామాలతో త్వరలోనే కనుమరుగవుతుందన్నారు. చంద్రబాబునాయుడుపై అక్రమంగా పెట్టిన ఇన్నర్ రింగ్‌రోడ్డు కేసుపై సుప్రీంకోర్టు తీర్పు జగన్ ప్రభుత్వానికి చెంపపెట్టులాటిందన్నారు. సమావేశంలో కంఠంశెట్టి శ్రీనివాసరావు, కముజు వరప్రసాద్, పప్పుల బుజ్జి, ముద్రగడ ఫణి, గొలకోటి నాగబాబు, సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై కలెక్టర్‌కు సర్పంచ్ ఫిర్యాదు

ఆత్రేయపురం, జనవరి 30: ఆత్రేయపురంలో అధికార పార్టీ నాయకులు అభివృద్ధికి ఆటంకం కలిగించడమే కాకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ సర్పంచ్‌ను వేధిస్తున్నారని టీడీపీ నాయకులు కలెక్టర్ హిమాన్షు శుక్లాకు ఫిర్యాదు చేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు ముదునూరి వెంకట్రాజు ఆధ్వర్యంలో సర్పంచ్ గెడ్డం సుధ, వార్డు సభ్యులు కలెక్టర్‌ను కలిసి పంచాయతీలో నెలకొన్న పరిస్థితులను వివరించారు. డీపీవో పంచాయతీ సమావేశం నిర్వహించి తనకు కనీసం సమాచారం తెలపకుండా అధికార పార్టీ నాయకులు సూచించిన పనులను చేపట్టేందుకు తీర్మానాలు చేశారన్నారు. పంచాయతీ నిధులను అధికార పార్టీ నాయకులు ఇష్టానుసారంగా పనులు చేసుకునే విధంగా సమావేశం నిర్వహించడంతో తనకు ఉన్న అధికారంతో సమావేశాన్ని వాయిదా వేసినట్టు సర్పంచ్ సుధ తెలిపారు. తన విధులకు అధికారులు ఆటంకం కలిగిస్తూ అధికార పార్టీ నేతలకు వత్తాసు పలుకుతున్నారన్నారు. గ్రామంలో సమస్యలను పరిష్కరించేందుకు తగిన చర్యలు చేపడతామని సర్పంచ్‌కు కలెక్టర్ హామీ ఇచ్చారు.

జాతీయ స్థాయి తైక్వాండో పోటీల్లో ప్రతిభ

అమలాపురం టౌన్, జనవరి 30: రాజస్థాన్‌లో జరిగిన జాతీయ స్థాయి తైక్వాండో పోటీల్లో పతకాలు సాధించిన క్రీడాకారులను మంగళవారం జీఎంసీ బాలయోగి స్టేడియంలో జిల్లా క్రీడాభివృద్ధి అధికారి పీఎస్ సురేష్‌కుమార్ ఆధ్వర్యంలో అభినందించారు. జిల్లా క్రీడాకారులు వివిధ కేటగిరీల్లో 4పతకాలు సాధించారన్నారు. జాతీయ స్థాయిలో కె.వైష్ణవి (స్వర్ణ), బీహెచ్ సౌమ్య (రజత), పి.భార్గవిశ్రీకళ, కె.వైష్ణవి (కాంస్య) పతకాలు సాధించారు. వారిని క్రీడాభిమానులు, పీఈటీలు, పీడీలు అభినందించారు.

రాష్ట్ర విభజన హామీలు నెరవేర్చాలి

మామిడికుదురు, జనవరి 30: రాష్ట్ర విభజన హామీలు నెరవేర్చాలని ఆమ్‌ఆద్మీ పార్టీ జిల్లా కన్వీనర్ నల్లి శ్రీనివాస్ డిమాండు చేశారు. మామిడికుదురులో హామీలు నెరవేర్చాలంటూ పార్టీ నాయకులు మంగళవారం నిరసన చేపట్టారు. స్థానిక బస్టాండు కూడలిలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించి రాష్ట్రానికి ప్రత్యేక హోదా కల్పించాలని డిమాండు చేశారు. కార్యక్రమంలో పెయ్యల సూర్య, ఈతకోట కాలేశ్వరరావు, మెర్ల శాస్త్రులు, గూడపాటి విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

జనసేన పార్టీని మరింత బలోపేతం చేయాలి

ముమ్మిడివరం, జనవరి 30: జనసేన పార్టీని గ్రామ స్థాయిలో మరింత బలోపేతం చేసేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పితాని బాలకృష్ణ పిలుపునిచ్చారు. ముమ్మిడివరం నగర పంచాయతీ 20వార్డుల కన్వీనర్లతో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికార పార్టీ వైఫల్యాలను ప్రజలకు తెలియచెప్పి జనసేన, టీడీపీ పార్టీల ఉమ్మడి మేనిఫెస్టోను ప్రజలకు తెలియచెప్పి పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. జక్కంశెట్టి బాలకృష్ణ, సానబోయిన మల్లికార్జునరావు, కడలి వెంకటేశ్వరరావు, రంబాల రమేష్, యలమంచిలి బాలరాజు, సానబోయిన వీరభద్రరావు, పితాని రాజు, చిట్టూరి దొరబాబు పాల్గొన్నారు.

మహాత్మాగాంధీ నడిచిన బాటలో నడవాలి

- మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు
- జిల్లాలో గాంధీ వర్ధంతి కార్యక్రమాలు
- నివాళులర్పించిన నాయకులు, అధికారులు



మండపేటలో గాంధీకి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వేగుళ్ల

మండపేట, జనవరి 30: మహాత్మాగాంధీ నడిచిన బాటలో మన మంతా నడవాలని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. ద్వారపూడి ఆర్యవైశ్య కల్యాణ మండపం వద్ద గాంధీ విగ్రహానికి వేగుళ్ల నివాళులర్పించారు. మండపేట సంఘంకాలనీ ఎంపీపీ పాఠశాలలో చిన్నారులు గాంధీ చిత్రపటానికి నివాళులర్పించారు. ద్వారపూడిలో జరిగిన కార్యక్రమంలో టీడీపీ శ్రేణులు పాల్గొన్నారు.

అమలాపురం రూరల్: బండారులంకలోని కాంగ్రెస్ జిల్లా శాఖ కార్యాలయం వద్ద జాతిపిత చిత్రపటానికి జిల్లా శాఖ అధ్యక్షుడు కామన ప్రభాకరరావు పూలమాలవేసి నివాళులర్పించారు. నాయకులు ముషిణి రామకృష్ణారావు, షకీల, రాయుడు రమణ, వస్కా శ్యామ్, ప్రకాష్ పాల్గొన్నారు. బండారులంక పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ పెనుమాల సునీత ఆధ్వర్యంలో గాంధీజీ విగ్రహానికి నివాళులర్పించారు. వీఆర్వో దంగేటి వీరరాఘవులు, బుజ్జిరాజు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆత్రేయపురం: వాసవి క్లబ్ ఆధ్వర్యంలో గాంధీ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. అనంతరం స్వచ్ఛభారత్ నిర్వహించారు. కార్యక్రమంలో పట్నాల నాగరాజు, వెత్సా నాగవెంకటసుబ్రహ్మణ్యం, కోశాధికారి శ్రీకాకోళపు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ముమ్మిడివరం: మహాత్మాగాంధీ వర్ధంతిని ముమ్మిడివరంలో మంగళవారం జరుపుకున్నారు. లంకతల్లెమ్మ సెంటర్‌లో గల గాంధీ విగ్రహానికి పలువురు పూలమాలలువేసి నివాళులర్పించారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు పి.ఉదయభాస్కరవర్మ, ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు వడ్డి నాగేశ్వరరావు, శ్రీనివాసరాజు, గుద్దటి బాబ్జి పాల్గొన్నారు. ముమ్మిడివరం నగర పంచాయతీ కార్యాలయంలో గాంధీజీ చిత్రపటానికి కమిషనర్ జి.లోవరాజు, చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. నగర పంచాయతీ, మెప్మా, సచివాలయ సిబ్బంది, వైద్యఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

కాట్రేనికోన: కాట్రేనికోన పీహెచ్‌సీలో వైద్యాధికారులు నీలిమ, లిఖిత ఆధ్వర్యంలో గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వచ్చేనెల 13వరకు లెప్రసీ వ్యాధిపై సచివాలయాల పరిధిలో అవగాహన కల్పించేందుకు ఏర్పాట్లుచేసినట్టు వైద్యాధికారులు తెలిపారు.

ఉప్పలగుప్తం: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ జవ్వాది వెంకటేశ్వరి గాంధీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఉప్పలగుప్తం,ఎస్.యానాం ఆరోగ్య కేంద్రాల్లో గాంధీ వర్ధంతి జరుపుకున్నారు. వైద్యాధికారులు డిల్లీ ప్రసాద్, లోవలక్ష్మి, లంకే నాగరాజు పాల్గొన్నారు. సర్పంచ్‌లు కడిమి చిన్నవరాజు, జోగిరాజేశ్వరీరాజా, ఎంపీటీసీ పెట్టా అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

మామిడికుదురు: మామిడికుదురులో గాంధీజీ విగ్రహానికి కాంగ్రెస్ నాయకులు పూలమాలలువేసి నివాళులర్పించారు. పార్టీ మండల శాఖ అధ్యక్షుడు అప్పన రామకృష్ణ, గెడ్డం వెంకటేశ్వరరావు, నీతిపూడి బాలసత్యనారాయణ, బత్తుల సురేష్‌బాబు, వారణాసి దొరబాబు పాల్గొన్నారు.

యానాం: స్థానిక గాంధీపార్కులో, బొటానికల్‌గార్డెన్, ఫెర్రిరోడ్డులో ఉన్న గాంధీ విగ్రహాలకు పరిపాలనాధికారి ఆర్.మునిస్వామి, మున్సిపల్ కమిషనర్ ఖండవల్లి రామకృష్ణ, ఆరోగ్యశాఖ డీడీ డాక్టర్ రవిశంకర్, సీఐ షణ్ముగం పూలమాలలువేసి నివాళులర్పించారు. వివిధశాఖల అధికారులు, యానాం సమాచారశాఖ అధికారి కె.ఎల్.వి.ప్రసాద్, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు. స్థానిక జవహర్ నవోదయ విద్యాలయంలో ఉన్న గాంధీ విగ్రహానికి ప్రిన్సిపాల్ టీవీఎస్ ప్రకాశరావు పూలమాలలువేసి నివాళులర్పించారు. విద్యాలయ వైస్ ప్రిన్సిపాల్ బేగం, విద్యార్థులు పాల్గొన్నారు.

రాజోలు: రాజోలు గాంధీబొమ్మ సెంటర్‌లో ఉన్న గాంధీ విగ్రహానికి, రాజోలు ఆర్యవైశ్య కల్యాణ మండపంలో ఉన్న గాంధీ విగ్రహానికి ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు కాసు శ్రీనివాస్ పూమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో కాసు శ్రీనివాసరంగనాయకమూర్తి, గెల్లి అన్నపూర్ణ, కొత్త శ్రీనివాసరావు, రాజా నాగరత్నకుమార్, లక్కింశెట్టి బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

పి.గన్నవరం: పి.గన్నవరం అక్విడెక్టు వద్ద గాంధీజీ విగ్రహానికి జడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పోతవరం ప్రాథమిక పాఠశాలలో హెచ్ఎం కత్తుల ఆనందరావు ఆధ్వర్యంలో గాంధీజీ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాల్లో అడ్డగళ్ల వెంకటసాయిరాం, పెంటపాటి శ్రీనివాస్, కొక్కిరి రవికుమార్, ఉపాధ్యాయులు జి.శ్రీనివాస్, సీహెచ్‌బి వరలక్ష్మి, నరేంద్రపురం స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ ఎ.సూర్యనారాయణ, ఆర్యవైశ్యసంఘ సభ్యులు పాల్గొన్నారు.

అంబాజీపేట: పుల్లేటికుర్రు సెంటర్‌లో గాంధీ విగ్రహానికి సర్పంచ్ జల్లి బాలరాజు, ఉపసర్పంచ్ వీరా రవి, నాయకులు నూకపెయ్యి చిన్న, అందె వెంకటముక్తేశ్వరరావు, ఆకెళ్ల సూరిబాబులు పూలమాలలువేసి నివాళులర్పించారు. ఇరుసుమండ పంచాయతీ కార్యాలయం వద్ద గాంధీ చిత్రపటానికి కార్యదర్శి ఆర్.ఏడుకొండలు చంటి, అక్కిశెట్టి వీరవెంకట సత్యనారాయణ, సచివాలయ ఉద్యోగులు పూలమాలలువేసి నివాళులర్పించారు.

ఉప్పలగుప్తం: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ జవ్వాది వెంకటేశ్వరి గాంధీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఉప్పలగుప్తం, ఎస్.యానాం ఆరోగ్య కేంద్రాల్లో గాంధీ వర్ధంతి జరుపుకున్నారు. వైద్యాధికారులు డిల్లీ ప్రసాద్, లోవలక్ష్మి, లంకే నాగరాజు పాల్గొన్నారు. సర్పంచ్‌లు కడిమి చిన్నవరాజు, జోగిరాజేశ్వరీ రాజా, ఎంపీటీసీ పెట్టా అప్పారావు పాల్గొన్నారు.

అల్లవరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మహాత్మాగాంధీ చిత్రపటానికి ఎంపీడీవో బీఎస్ఎస్ కృష్ణమోహన్ పూలమాలలువేసి నివాళులర్పించారు. కొమరగిరిపట్నం, యెంట్రుకోన సచివాలయాల వద్ద సర్పంచ్‌లు రాకాపు విజయలక్ష్మి, తిక్కిరెడ్డి నాగవెంకటే శ్రీనివాసు ఆధ్వర్యంలో గాంధీ వర్ధంతి జరిపారు. ఏవో బి.లక్ష్మణరావు, పంచాయతీల కార్యదర్శులు ఎస్.రాజమోహన్, ఎస్వీవీ సత్యనారాయణ, అడబాల శ్రీరామచంద్రమూర్తి, ఏపీవో వి.శ్రీనుబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

కొత్తపేట: వాడపాలెంలో గాంధీజీ చిత్రపటానికి టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండారు సత్యానందరావు పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కంఠంశెట్టి శ్రీనివాసరావు, ముద్రగడ ఫణి, కముజు వరప్రసాద్, పప్పుల బుజ్జి, గొలకోటి నాగబాబు, కొప్పర్తి సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

రావులపాలెం: స్థానిక శ్రీవాసవి ఆర్యవైశ్య సంఘ భవనంలో గాంధీజీ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. శ్రీవాసవి ఆర్యవైశ్య సంఘానికి అనుబంధంగా శ్రీవాసవి మహాత్మాగాంధీ సేవా సమితిని నూతనంగా ఏర్పాటుచేశారు. గౌరవ అధ్యక్షునిగా మన్యం పర్వత వర్ధనరావు, అధ్యక్షునిగా మోటమర్రి సూరిబాబు, ప్రధాన కార్యదర్శిగా కంకటాల హరినాథ్, కోశాధికారిగా కండిచర్ల నాగబాబును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

కుష్టు వ్యాధిపై అవగాహన కల్పించాలి

కపిలేశ్వరపురం: కుష్టువ్యాధిపై గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలని వైద్య, ఆరోగ్య సిబ్బందికి డీఎం అండ్‌హెచ్‌వో దుర్గారావుదొర సూచించారు. మంగళవారం అచ్యుతాపురం పీహెచ్‌సీని దుర్గారావుదొర, లెప్రసీ నివారణ అధికారి భరతలక్ష్మి సందర్శించారు. కాలేరులో కుష్టు వ్యాధిపై నిర్వహించిన అవగాహన సదస్సులో వారు మాట్లాడారు. డీపీఎం పోతుల వెంకటేశ్వరరావు సమకూర్చిన దుప్పట్లు, రొట్టెలను వ్యాధి బాధితులకు వారు అందజేసారు. గ్రామసర్పంచ్ దాయం కావేరిశేఖర్‌బాబు, పీహెచ్‌సీ వైద్యాధికారిణి ఎన్.కరుణేంద్రకుమారి, ఎంపీహెచ్‌వో గోపాలకృష్ణ, డీఎంవోలు వెంకటేశ్వరరావు, వెంకటేశ్వర్లు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

మామిడికుదురు: ప్రతీ ఒక్కరూ కుష్టువ్యాధి రహిత సమాజానికి కృషి చేయాలని నగరం పీహెచ్‌సీ వైద్యాధికారి కేజే ప్రశాంత్ కోరారు. నగరం పీహెచ్‌సీలో కుష్టు వ్యాధి నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వ్యాధి లక్షణాలున్న వారిని గ్రామాల్లో గుర్తించి నివారణ చర్యలు చేపడతామని ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయించారు. సూపర్‌వైజర్ సత్యనారాయణ పాల్గొన్నారు.

అంబాజీపేట: కుష్టు వ్యాధిని అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఉండాలని సీహెచ్‌వో ఎం.రవికుమార్ అన్నారు. ఇరుసుమండ పంచాయతీ కార్యాలయం వద్ద కుష్టు వ్యాధి నివారణ దినోత్సవాన్ని నిర్వహించారు. రోగులకు మందులు పంపిణీ చేశారు. హెచ్‌వీ విజయకుమారి, సూపర్‌వైజర్ రాధా నారాయణపాల్గొన్నారు.

బీజేపీ సమావేశం

అంతర్వేది, జనవరి 30: టేకిశెట్టిపాలెంలో బీజేపీ మండల అధ్యక్షుడు పట్టాపు సూర్యప్రకాశరావు అధ్యక్షతన మంగళవారం ప్రశిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మాజీ ఎమ్మెల్యే మానేపల్లి అయ్యాజీవేమా విచ్చేసి మాట్లాడారు. పల్లెకు పోదాం మండల కన్వీనర్, కోకన్వీనర్, గ్రామ కన్వీనర్ ప్రవాసాయోజనా కార్యకర్తలకు మార్గదర్శనం చేశారు. 9,10,11 తేదీల్లో పల్లెకు పోదాం కార్యక్రమాలను ప్రతీగ్రామంలో విజయవంతం చేయాలన్నారు. జిల్లా అధికార ప్రతినిధి మాలే శ్రీనివాసనగేష్, రాష్ట్ర కిసాన్‌మోర్చా డ్రైనేజీసెల్ కన్వీనర్ చెంపాటి శివరామకృష్ణంరాజు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

త్యాగరాజస్వామి ఆరాధనోత్సవాలు

రాయవరం, జనవరి 30: పసలపూడిలో త్యాగరాజస్వామి ఆరాధనోత్సవాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. డోలు సన్నాయి కళాకారుల సంఘం ఆధ్వర్యంలో పసలపూడికి చెందిన ముమ్మిడివరపు సూర్యనారాయణ, కేశనకుర్తి సాంబశివ కోటయ్య, ముమ్మిడివరపు సత్తిరాజు, సత్యనారాయణ, కోటయ్య, కేశనకుర్తి స్వామి నేతృత్వంలో త్యాగరాజుస్వామి చిత్రపటంతో గ్రామోత్సవం నిర్వహించారు.స్థానిక వేణుగోపాలస్వామి ఆలయ ప్రాంగణంలో విశాఖ, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలకు చెందిన కళాకారులు త్యాగరాజు కచేరిలో పాల్గొన్నారు.

రిపబ్లిక్‌డే పరేడ్‌లో ముక్కామల కళాకారులు



ఏపీ శకటం వద్ద నృత్యం చేస్తున్న ముక్కామల కళాకారులు

అంబాజీపేట, జనవరి 30: ఢిల్లీలో జరిగిన 75వ గణతంత్ర వేడుకల్లో రాష్ట్రం తరపున పాల్గొన్న ఆంధ్రప్రదేశ్ శకటానికి మూడో స్థానం లభించింది. పాఠశాల విద్యను మార్చడం- విద్యార్థులను ప్రపంచ వ్యాప్తంగా పోటీపడేలా చేయడం అనే ఇతివృత్తంలో డిజిటల్ విద్యా బోధన, నాడు నేడు, ఆంగ్ల మాధ్యమంలో బోధన నేపథ్యంలో శకటాన్ని రూపకల్పన చేసి ప్రదర్శించారు. సమాచార శాఖ జేడీ పి.కిరణ్‌కుమార్, ఆర్టిస్ట్ గంటా మధుల నేతృత్వంలో పాల్గొన్న శకటంతో పాటుగా 55సెకన్ల నిడివిగల థీమ్ సాంగ్ పాటను రూపొందించి దానికి తగినట్టుగా శకటానికి ఇరువైపులా ముక్కామలకు చెందిన కళాకారులు నృత్యం చేశారు. ముక్కామలకు చెందిన పుసుపులేటి నాగబృందం ఆధ్వర్యంలో సాయి శివనృత్య పాఠశాలకు చెందిన కూచిపూడి కళాకారులు స్కూల్ విద్యార్థుల యూనిఫామ్‌తో శకటానికి ఇరువైపులా నృత్యం చేసి ఆకట్టుకున్నారు. ఏపీ శకటానికి మూడో స్థానం లభించింది. ఢిల్లీలో రాష్ట్రీయ రంగశాల మంచ్‌లో జరిగిన అవార్డుల ప్రదానోత్సవంలో కేంద్ర రక్షణ మంత్రి రాజానాథ్‌సింగ్ నుంచి అవార్డును ఏపీ సమాచారశాఖ జేడీ కిరణ్‌కుమార్ అందుకున్నారు. గత ఏడాది జగ్గన్నతోట ఏకాదశ రుద్రుల శకటాన్ని రూపొందించి ప్రజల మన్ననలను పొందారు.

కుమ్మర్ల సంక్షేమానికి కృషి చేయాలి

కపిలేశ్వరపురం, జనవరి 30: కుమ్మర్లంతా ఏకతాటిగా నిలిచి సంక్షేమానికి కృషి చేయాలని కుమ్మరి శాలివాహన సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు మానేపల్లి వీరబ్రహ్మం అన్నారు. టేకిలో నిర్వహించిన మండల కుమ్మరి శాలివాహన సంక్షేమ సంఘం కార్యవర్గం ఎన్నికల్లో ఆయనమాట్లాడారు. సంఘం గౌరవ అధ్యక్షుడిగా పేరూరి వెంకటేశ్వరరావు, అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా అంబటి నగేష్, మాచవరపు శ్రీనివాస్, బురదకలి వెంకటేశ్వరరావు, ప్రధానకార్యదర్శిగా పాలకొల్లు వెంకటేశ్వరరావు, సహాయకార్యదర్శిగా కోటిపల్లి వీరబాబు, పసలపూడి సర్వేశ్వరరావు, కోశాధికారిగా పేరూరి సూర్యసత్యనారాయణ, ఆర్గనైజర్‌గా పాండురేకుల రాంబాబు కార్యవర్గ సభ్యులుగా వానపల్లి వీరవెంకట సత్యనారాయణ, ఏలూరి శ్రీను, అంబటి వీరవెంకట సత్యనారాయణ, అంబటి వెంకటేశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

తుగ్లక్ పాలనతో రాష్ట్ర ప్రజలు అవస్థలు



చింతలూరులో బాబుతో భవిష్యత్ గ్యారంటీలో మహిళలతో మాట్లాడుతున్న బండారు సత్యానందరావు

ఆలమూరు, జనవరి 30: తుగ్లక్ పాలనతో రాష్ట్ర ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వాటి నుంచి బయటపడాలంటే రాష్ట్రంలో టీడీపీ పాలన రావాలని కోరుకుంటున్నారని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. చింతలూరులో మంగళవారం ఆయన ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ప్రజలను బండారు నేరుగా కలిసి ష్యూరిటీ కరపత్రాలను అందజేశారు. మహిళలు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. తుగ్లక్ పాలనకు చింతలూరులో పేర్గాంచిన ఆయుర్వేద మందులు వేయిస్తే మంచిదని సూచించారు. త్వరలో రాష్ట్రంలో సుపరిపాలన రానుందని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు మెర్ల గోపాలస్వామి, దండంగి మమత, వాకా సుబ్బలక్ష్మీదేవి, వైట్ల శేషబాబు, చింతలూరు ఫణికుమార్, పెద్దింటి కాశీ, వంటిపల్లి సతీష్‌కుమార్, ఈదల నల్లబాబు, బుంగ శ్రీనివాస్ పాల్గొన్నారు.

రాబోయేది టీడీపీ పాలనే

అల్లవరం, జనవరి 30: రాష్ట్రంలో రాబోయేది చంద్రబాబు పాలనేనని, టీడీపీకి అండగా నిలవాలని శెట్టిబలిజ సాధికార సమితి రాష్ట్ర డైరెక్టర్ కడలి వెంకటేశ్వరరావు, టీడీపీ వాణిజ్య విభాగం కార్యదర్శి నార్గన శ్రీనివాసరావు కోరారు. బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారంటీలో భాగంగా సూపర్‌సిక్స్ పథకాలపై యెంట్రుకోనలో ప్రచారం చేశారు. మోటూరి సత్తిబాబు, దేవరపల్లి సురేష్, గెద్దాడ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రేపటి నుంచి వంతులవారీ విధానంలో సాగునీరు

కె.గంగవరం, జనవరి 30: ఫిబ్రవరి 1 నుంచి సాగునీటి సరఫరాను వంతులవారీ విధానంలో సరఫరా చేయనున్నట్లు ఇరిగేషన్ ఏఈ కె. సుబ్బారావు చెప్పారు. చొప్పెల్లలాకుకు ఒక రోజు, కపిలేశ్వరపురం లాకుకు ఒక రోజు, కూళ్ల లాకుకు రెండు రోజులు, మసకపల్లి లాకుకు రెండు రోజులు, తాళ్లరేవు లాకుకు మూడు రోజులు చొప్పున నీటిని విడుదల చేస్తామన్నారు. ఒక వంతు అయిన తరువాత సుమారు 9రోజులకు వంతు వస్తుందని ఆయన చెప్పారు.

వైసీపీ నుంచి టీడీపీలో చేరిన యువకులు



మండపేట, జనవరి 30: స్థానిక టీడీపీ కార్యాలయంలో స్థానిక 11వ వార్డుకు చెందిన కొవ్వాడ అప్పన్నబాబు నేతృత్వంలో వార్డుకు చెందిన వైసీపీ ఐదో సచివాలయ కన్వీనర్ బెందల వెంకన్న, గృహసారథులు బుసి సురేష్ కాంద్రు శ్రీనివాస్, మద్దుల రవితేజ, బిళ్ల వీర్రాజు, పైన గంగరాజు, కోలాటి బాలు, కొవ్వాడ సురేష్ శివసన్నాల ప్రేమ్, ఈతకోట సీతయ్య, రావడ రాజు, అనిల్, పలువురు యువకులు వైసీపీ నుంచి ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, మున్సిపల్ మాజీ చైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్ సమక్షంలో టీడీపీలో చేరారు. వారికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు యు.రాంబాబు, పిట్టా రాజబాబు, ఆళ్ల వీరబాబు పాల్గొన్నారు.

అవార్డు గ్రహీత ఎంపీడీవోకు సన్మానం

అల్లవరం, జనవరి 30: గణతంత్ర దినోత్సవం నాడు ఉత్తమ సేవా పురస్కారం అందుకున్న ఎంపీడీవో బీఎస్ఎస్ కృష్ణమోహన్‌ను ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, జడ్పీటీసీ కొనుకు గౌతమి, ఏపీ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ పీకే రావు సన్మానించారు. కార్యక్రమంలో పీఆర్ ఏఈ జి.సంపత్, ఏవో బి.లక్ష్మణరావు, ఏపీవో వి.శ్రీనుబాబు తదితరులు పాల్గొన్నారు.

డ్రెయిన్లలోకి సజ్జు మళ్లింపుపై ఫిర్యాదు

అల్లవరం, జనవరి 30: బోడసకుర్రు పరిధిలోని ఆక్వా చెరువుల నుంచి సజ్జును కౌశిక డ్రెయిన్‌లోకి మళ్లించడంపై ఆక్వా రైతులు అధికారులకు ఫిర్యాదు చేశారు. తక్షణం నిలుపుదల చేయాలని డ్రెయిన్స్ ఈఈ కిషోర్, తహసీల్దారు ఎన్ఎస్ఎస్ ప్రసాద్‌లకు వారు విజ్ఞప్తి చేశారు.

గోడి గురుకుల ఇంటర్ విద్యార్థి అదృశ్యం



అల్లవరం, జనవరి 30: గోడి గురుకుల కళాశాలలో పి.గన్నవరం మండలం పోతవరం గ్రామానికి చెందిన కోరుకొండ యశ్వంత్‌కుమార్ ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. మంగళవారం హాస్టల్ నుంచి బయటకు వెళ్లిన అతడు తిరిగిరాలేదని ప్రిన్సిపాల్ ఎన్.శ్రీనివాస్ అల్లవరం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

ముమ్మిడివరం, జనవరి 30: వాతావరణంలో మార్పుల కారణంగా వరి పైరుపై జింక్ లోపం, కాండం తొలిచే పురుగు, ఆకుముడత వంటి పురుగులు, తెగుళ్ల ఆశిస్తున్నందున రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ బి.భవానీ, డాక్టర్ పీబీ ప్రదీప్‌కుమార్ సూచించారు. ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలోని రాజుపాలెం, అయినాపురం గ్రామాల్లో ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తల బృందం మంగళవారం పర్యటించి వరి పొలాలను పరిశీలించారు. రైతు పంట పొలాలను పరిశీలించి రైతులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఎంటీయూ 1121 వరి రకం విత్తనం వెదజల్లే పద్ధతిలో, నాట్లు వేసిన పద్ధతిలో సాగుచేసిన పొలంలో జింక్ లోపం, కాండం తొలిచే పురుగు, ఆకుముడత ఉన్నట్టు వారు గుర్తించారు. జింక్ లోపం ఉన్న వరిపైరుపై నివారణకు జింక్ సల్ఫేట్ 2 గ్రాములు లీటరు నీటిలో కలిపి వరి నారు మడి, వరి నాట్లు వేసిన పొలంలో 4 లేదా 5 రోజుల వ్యవధిలో రెండు, మూడు సార్లు పిచికారీ చేయాలన్నారు. వారి వెంట జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ సహాయ సంచాలకులు ఎ.రాజశేఖర్, ఏవో ఎస్.ప్రశాంత్‌కుమార్, ఏఈవో కృష్ణయ్య, గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు ఉన్నారు.

ఏఎంసీ చైర్మన్ పదవికి సిరిపురపు రాజీనామా

మండపేట, జనవరి 30: మండపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సిరిపురపు శ్రీనివాస్ ఈనెల25న తన చైర్మన్ పదవికి రాజీనామా చేశారు. రెండేళ్ల పదవిలో కొనసాగాల్సిన శ్రీనివాస్ పెద్దల మధ్య కుదిరిన ఒప్పందంతో 9నెలలకే చైర్మన్ పదవి నుంచి తప్పుకున్నారు. తాత్కాలిక చైర్మన్‌గా ప్రస్తుత ఏఎంసీ వైస్ చైర్మన్ చిక్కాల శ్రీనివాసరావు సోమవారం బాధ్యతలు చేపట్టారు.

పిచ్చికుక్క స్వైర విహారం

మామిడికుదురు, జనవరి 30: పెదపట్నంలో సోమవారం కొమ్ముల దత్తవేణుగోపాల్, యర్రంశెట్టి దుర్గ, యర్రంశెట్టి హేమలపై పిచ్చికుక్క దాడి చేసింది. బాధితులు రాజోలు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

కాల్వలో గల్లంతైన చిన్నారి మృతదేహం లభ్యం

కాట్రేనికోన, జనవరి 30: పంటకాల్వలో సోమవారం గల్లంతైన మేకల నీహారిక(7) మృతదేహాన్ని అధికారులు కనుగొన్నారు. పిఠాపురానికి చెందిన తల్లిదండ్రులకు మృతదేహాన్ని అప్పగించారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

ఆట స్థలంలో ఆక్రమణలు తొలగించాలని ఫిర్యాదు

కె.గంగవరం, జనవరి 30: పామర్రు ఉన్నతపాఠశాల ఆట స్థలాన్ని ఆనుకుని ఉన్న ఆక్రమణలు తొలగించాలని తహసీల్దార్ టి.వైద్యనాథ్‌శర్మకు, అముజూరు సర్పంచ్ నానావరపు కళ్యాణి శ్రీనివాస్‌కు హెచ్ఎం శ్రీనివాస్ ఫిర్యాదు చేశారు.

సినిమా గైడ్

అమలాపురం

వెంకటరామ	: 105
వెంకటరమణ	: డెవిల్
శ్రీలలిత	: కెప్టెన్ మిల్లర్
శేఖర్ స్క్రీన్-1	: హనుమాన్
శేఖర్ స్క్రీన్-2	: నాసామిరంగ
రమా	: గుంటూరు కారం
గణపతి	: సైంధవ్
వెంకటపద్మావతిస్క్రీన్-1	: హనుమాన్
వెంకటపద్మావతి స్క్రీన్-2	: సలార్

ఎన్నికలకు సిద్ధం కావాలి

ముమ్మిడివరం, జనవరి 30: రానున్న ఎన్నికల్లో వైసీపీ పార్టీ విజయానికి కార్యకర్తలు కృషి చేయాలని ఎమ్మెల్యే పొన్నాడ సతీష్‌కుమార్ పిలుపునిచ్చారు. స్థానిక అంబేడ్కర్ కన్వెన్షన్ హాలులో మంగళవారం జరిగిన నియోజకవర్గ పార్టీ విస్తృత స్థాయి సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. ఫిబ్రవరి 3న దెందులూరులో జరిగే సీఎం భారీ బహిరంగ సభకు నియోజకవర్గం నుంచి భారీ స్థాయిలో పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలిరావాలన్నారు. సీఎం సభకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. సమావేశంలో పార్టీ నాయకులు పెన్మెత్స చిట్టిరాజు, డిల్లీ నారాయణ, పెయ్యల చిట్టిబాబు, కాశి బాలమునికుమారి నడింపల్లి సూరిబాబురాజు, నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్, ఎంపీపీలు కోలా గంగాభవాని, మిరియం జ్యోతి, జడ్పీటీసీలు కుడుపూడి శంకరరావు పాల్గొన్నారు.

కమిషనర్‌కు సత్కారం


రామచంద్రపురం, జనవరి 30: గుడివాడకు బదిలీ అయిన మున్సిపల్ కమిషనర్ కె.శ్రీకాంత్‌రెడ్డిని మంగళవారం ఆయన చాంబర్‌లో పట్టణంలోని 12సచివాలయాలకు చెందిన వీఆర్వోలు సత్కరించారు. వీఆర్వోల విధుల పట్ల వివక్షతకు తావు లేకుండా శ్రీకాంత్‌రెడ్డి వ్యవహరించారని వీఆర్వోల రాష్ట్రప్రచార కార్య దర్శి మద్దాల బాహుజీ అన్నారు. వీఆర్వోల సంఘం డివిజన్ ఉపాధ్యక్షుడు పి.సాయి ప్రతిమ, వీఆర్వోల పట్టణ అధ్యక్షులు ఎన్.శేఖర్, కార్యదర్శి సత్యవతి, గౌరవ అధ్యక్షుడు చీకట్ల ఆంజనేయులు, ఉపాధ్యక్షుడు ఎన్.సత్య నారాయణరెడ్డి, సహాయ కార్యదర్శి చిక్కాల మానస, కోశాధికారి సీతామహాలక్ష్మి, కనకదుర్గ పాల్గొన్నారు.

జయహో బీసీ సభను విజయవంతం చేయండి



ఐ.పోలవరం, జనవరి 30: ముమ్మిడివరం నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో నిర్వహించనున్న టీడీపీ జయహో! బీసీ! సమావేశాలను విజయవంతం చేయాలని మాజీఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు పిలుపునిచ్చారు. మురమళ్లలో మంగళవారం అమలాపురం పార్లమెంటు టీడీపీ బీసీ సెల్ అధ్యక్షుడు వాడ్రేవు వీరబాబు అధ్యక్షతనపార్టీ సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. ఫిబ్రవరి 1నకాట్రేనికోన, 3నముమ్మిడివరం, 5న ఐ.పోలవరం 7న తాళ్లరేవు మండలాల్లో జరిగే బీసీసదస్సులకు భారీగా జనసమీకరణ చేయాలన్నారు. మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానంద, గుత్తుల సాయి, నాగిడి నాగేశ్వరరావు, మందాల గంగసూర్యనారాయణ,రాయపురెడ్డి నీలకంఠేశ్వరరావు, గంజా సుధాకర్, సాగిరాజు సూరిబాబురాజు, తాడి నరసింహారావు, అర్దాని శ్రీను, బీర సత్యకుమారి, టేకుమూడి లక్ష్మణరావు, పొన్నమండ రామలక్ష్మి, పొద్దోకు బాలు, పిల్లి నాగరాజు, సాక సీతాదేవి, కట్టా త్రిమూర్తులు పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి: ఎమ్మెల్యే వేగుళ్ల



రాయవరం, జనవరి 30: వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా టీడీపీ నాయకులు, కార్యకర్తలు, బూత్ కమిటీల సభ్యులు పనిచేయాలని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. మంగళవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో క్లస్టర్ పరిధిలోని యూనిట్, బూత్ ఇన్‌చార్జ్‌లు, పార్టీ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించాలన్నారు. రాష్ట్రంలో సుస్థిర పాలన రావాలంటే చంద్రబాబు తిరిగి అధికారంలోకి రావాన్నారు. ఇంటిగ్రేటెడ్ శిక్షణా ట్రైనర్ గండి చంద్రశేఖర్, టీడీపీ నేతలు వైఆర్కే పరమహంస, నల్లమిల్లి సత్యనారాయణరెడ్డి, ఎంపీటీసీ వుండవిల్లి సుబ్బారాయుడు, మాజీ వైస్ ఎంపీపీ దేవు వెంకట్రాజు, మాజీ జడ్పీటీసీ కర్రి వెంకటరెడ్డి, మాజీ ఎంపీటీసీలు నల్లమిల్లి వెంకన్నబాబు, పిల్లి గణేష్, కొవ్వూరి చంటిరెడ్డి, వడ్డాది చిన్న కృష్ణంరాజు, సుంకవిల్లి గంగరాజు, వెలుగుబంట్ల గోపికృష్ణ, టీడీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలకు నిరసన

అమలాపురం రూరల్, జనవరి 30: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో ఈదరపల్లిలోని చింతపల్లి స్మారకస్థూపం వద్ద మంగళవారం నిరసన తెలిపారు. జిల్లా కన్వీనర్ బండారు బాలకృష్ణ, సహ కన్వీనర్ ఉగ్గిరాల సురేష్, సీపీఐ జిల్లా కార్యదర్శి కె.సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

శాలివాహన సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

ఆలమూరు, జనవరి 30: ఆలమూరు మండల శాలివాహన సంఘం నూతన కార్యవర్గ ఎన్నిక మంగళవారం ఏకగ్రీవంగా జరిగింది. అధ్యక్షునిగా మల్లవరపు మల్లేశ్వరరావు, గౌరవాధ్యక్షునిగా పేరూరి త్రిమూర్తులు, ఉపాధ్యక్షునిగా పుల్లేటికుర్తి సుబ్రహ్మణ్యం, పేరూరి రాజు, ప్రధాన కార్యదర్శిగా పసలపూడి శ్రీనివాసరావు, సహాయ కార్యదర్శిగా పాండ్రాకుల సత్తిబాబు, పాండ్రాకుల కాళీకృష్ణ, కోశాధికారిగా పాలకొల్లు పట్టాభిరామయ్య, ఆర్గనైజర్‌గా పాండ్రాకుల అమర్నాథ్ ఎన్నిక కాగా వారిని పలువురు పూలమాలలతో సత్కరించారు.

కాంగ్రెస్ పార్టీలో చేరిన రౌతు

రావులపాలెం, జనవరి 30: రావులపాలేనికి చెందిన జనసేన నేత డాక్టర్ రౌతు ఈశ్వరరావు ఆ పార్టీని వీడి కాంగ్రెస్‌లో చేరారు. మండపేటలో ఆయనకు కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కామన ప్రభాకరరావు కండువా కప్పి ఆహ్వానించారు.

కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

కొత్తపేట, జనవరి 30: కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం రాష్ట్రంలో ప్రవేశపెట్టిన పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం ద్వారా పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అడబాల సత్యనారాయణ, పాలూరి సత్యానందం కోరారు. బీజేపీ మండల సమావేశం అధ్యక్షుడు పాలాటి మాధవస్వామి అధ్యక్షతన కొత్తపేటలో నిర్వహించారు. నాయకులు గొలకోటి వెంకటేశ్వరరావు, కోటపల్లి సుబ్రహ్మణ్యం, పాలూరి జయప్రకాశ్‌నారాయణ, కోటపల్లి దామోదర్, ఉద్దరాజు ప్రసాద రాజు, ఇళ్ల పల్లంశెట్టి, భమిడిపాటి లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.